క్లుప్తంగా

కలసికట్టుగా పనిచేయండి



వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమైన గోవర్ధన్‌రెడ్డి

మడకశిర: మడకశిర అసెంబ్లీ, హిందూపురం పార్లమెంట్ అభ్యర్థులు ఈరలక్కప్ప, శాంతమ్మ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి కోరారు. ఆయన మంగళవారం తన స్వగృహ ఆవరణంలో మండలంలోని వివిధ పంచాయతీలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రచారాన్ని మరింత ఉధృతం చేయాలని కోరారు. ముఖ్యంగా ఆయా పంచాయతీల స్థానిక నాయకులు గడప గడపకూ వెళ్లి ప్రచారాన్ని ఉధృతం చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా కార్యదర్శి శ్రీరాములు, బుళ్లసముద్రం సర్పంచు సత్యనారాయణ, స్థానిక నాయకులు జమ్మానిపల్లి మూర్తి, నాగభూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

జేసీఎస్ కన్వీనర్‌గా గంగాధర్‌రెడ్డి



పరిగి: మండల జేసీఎస్ కన్వీనర్‌గా ఊటుకూరు పంచాయతీ గ్రామ పరిధిలోని దాసరిపల్లికి చెందిన గంగాధర్‌రెడ్డి కొనసాగనున్నారు. మంత్రి ఉషశ్రీచరణ్ ఆదేశాలతో గంగాధర్‌రెడ్డిని తిరిగి జేసీఎస్ కన్వీనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా కృషి చేస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్త మృతి

అమరాపురం: మండల పరిధిలోని బసవనపల్లి పంచాయతీ ఉప్పార్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్త సిద్ధమ్మ (45) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మృతురాలి స్వగ్రామం చేరుకుని సిద్ధమ్మ భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, బీసీ విభాగం ఉపాధ్యక్షుడు హలుకూరు కాంతరాజు తదితరులు సిద్ధమ్మ మృత దేహంపై వద్ద నివాళులర్పించారు.

గ్యాస్ సిలిండర్ల వినియోగంపై అవగాహన



మహిళలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మడకశిరరూరల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని మారుతీనగర్‌లో మంగళవారం గ్యాస్ సిలిండర్ల వినియోగంపై ప్రజలకు అగ్ని మాపక సిబ్బంది అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ ద్వారా ప్రమాదం చోటుచేసుకోకుండా ఎలా ఉపయోగించాలో మహిళలకు అవగాహన కల్పించారు. అంతేకాకుండా గ్యాస్ సిలిండర్ ప్రమాదవశాత్తు అంటుకోగానే ఎలా బయట పడాలో వివరించారు. అవగాహన కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి విజయ్‌కుమార్, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

పావగడ: చిత్రదుర్గం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం కాంగ్రెస్ అభ్యర్థి చంద్రప్ప, ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. లింగదహళ్లి, అరసికెరె, మంగళవాడ, కేటీ హళ్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటేశ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి బీఎన్ చంద్రప్పకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా



ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

అమరాపురం: బోరుబావుల్లో నీటిమట్టం తగ్గడంతో ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా ఆలదపల్లిలో సర్పంచు గిరిజమ్మ ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా మంచి నీటిని సరఫరా చేస్తున్నారు. ముఖ్యంగా బుధవారం శ్రీరామ నవమి పండుగ నేపథ్యంలో నీటి కోసం అవస్థలు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ఈ ఎన్నికల్లో గెలుపు వైఎస్సార్‌సీపీదే

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప



ఇంటింటా ప్రచారంలో మహిళలకు కరపత్రం అందిస్తున్న దృశ్యం



టీడీపీ వర్గీయులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ: ఎన్ని పార్టీలు జత కట్టి వచ్చినా ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపొందడం ఖాయం. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని వైఎస్సార్‌సీపీ మడకశిర ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప అన్నారు. మండలంలోని కరికెర, జంబులబండ గ్రామాల్లో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత కరికెరలోని గౌడ చంద్రమ్మదేవి ఆలయంలో పూజలు చేశారు. అనంతరం ఇంటింటి ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప మాట్లాడుతూ ప్రజలను మోసగించేందుకే చంద్రబాబు కూటమిగా జత కట్టారన్నారు. తొమ్మిదేళ్ల చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసింది శున్యమని విమర్శించారు. కేవలం టీడీపీ నాయకులు జన్మభూమి కమిటీ పేరుతో దాచుకోవడం, దోచుకోవడం, పంచుకోవడంలోనే సరిపోయిందని ధ్వజమెత్తారు. ప్రజా సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో ముఖ్యమంత్రి జగన్ దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకే ఓటు వేసి అత్యధిక మెజార్టీతో ఎమ్మెల్యే అభ్యర్థి అయిన తనతో పాటు ఎంపీ అభ్యర్థి శాంతమ్మను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జ్ అనంతరాజు, డైరెక్టర్ నేత్రావతి, రొళ్ల మాజీ మండల కన్వీనర్ తిమ్మన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి జీబీ శివకుమార్, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, ఎస్టీ విభాగ కమిటీ జాయింట్ సెక్రటరీ గిరిధర్, ఎంపీటీసీ పాతలింగప్ప, రత్నమ్మశివ, సర్పంచులు జీబీ కరుణాకర్, అశ్వత్, గౌరమ్మశివన్న, తిప్పేస్వామి, బీసీ సెల్ అధ్యక్షుడు పాండు, డీలర్ చంద్ర, నాయకులు లింగరాజు, బోరప్ప, ఈరన్న, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి చేరిక

గుడిబండ మండల పరిధిలోని జంబులబండ, కేకాతి గ్రామానికి చెందిన పవన్, సురేష్, బసవరాజు, భూతరాజు, చంద్ర, సతీష్ లతో పాటు దాదాపు 15 కుటుంబాలు మంగళవారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వారికి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. సర్పంచ్ జీబీ కరుణాకర్, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు, సర్పంచ్ అశ్వత్, ఎంపీటీసీ సభ్యులు పాతలింగప్ప, రాష్ట్ర ఎస్టీ సెల్ జాయంట్ సెక్రెట్రరీ గిరిధర్, బీసీ సెల్ అధ్యక్షుడు పాండు, ఈరన్న, గుడ్డదహళ్లి నాగరాజు, చంద్రశేఖర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'పురం'లో వైఎస్సార్సీపీ జెండా ఎగరడం ఖాయం



మండల నాయకులతో సమావేశమైన వేణురెడ్డి

చిలమత్తూరు: ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేయడం ఖాయమని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గస్థాయి నాయకుడు వేణురెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కొడికొండ చెక్‌పోస్ట్‌లో మండలంలో అందుబాటులో ఉన్న ప్రజా ప్రతినిధులు, నాయకులతో సమావేశమయ్యారు. వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు జగన్మోహన్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రామకృష్ణారెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, చాంద్, శీనా స్వామి, శంకరప్ప, సుందరరాజు, బాబేనాయక్ తదితర నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల సహకారం మరువలేను

- సీనియర్ సివిల్ జడ్జి శంకరరావు



సీనియర్ సివిల్ జడ్జి శంకరరావును సన్మానిస్తున్న న్యాయవాదులు

పెనుకొండ: సీనియర్ సివిల్ జడ్జిగా పెనుకొండ కోర్టులో పని చేయడం ఎన్నో తీయని జ్ఞాపకాలను మిగిల్చిందని సీనియర్ సివిల్ జడ్జి శంకరరావు పేర్కొన్నారు. పట్టణంలోని కోర్టు ఆవరణలో పలువురు న్యాయవాదులు అనంతపురానికి బదలీ అయిన న్యాయమూర్తి శంకరరావును సన్మానించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శంకరరావు మాట్లాడుతూ పెనుకొండలో తనకు న్యాయవాదులు అందించిన సహకారం ఎప్పటికీ మరువలేనన్నారు. ఇదే స్ఫూర్తితో అనంతపురంలో సైతం పని చేస్తానన్నారు. న్యాయవాదులు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జాయింట్ సెక్రటరీ నాగరాజు, శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ న్యాయమూర్తి శంకరరావు చేసిన సేవలు మరువలేనివన్నారు. జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసుపుల సయ్యద్, న్యాయవాదులు నాగిరెడ్డి, హరి, జావేద్, గంగినాయక్, సాయిప్రేమ, ఏపీపీ నగేష్ కోర్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



పెనుకొండ: రాజీనామా లేఖలను చూపుతున్న వలంటీర్లు

పెనుకొండ: పట్టణంలో 3వ సచివాలయానికి చెందిన 16 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. ఇందులో భాగంగానే సచివాలయ కన్వీనర్‌కు రాజీనామా లేఖలను సమర్పించారు. వైఎస్సార్‌సీపీ గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని చాంద్‌బాషా, గంగరత్నమ్మ, లత, శ్వేత, సింధు, లావణ్య, అరుణ తదితరులు తెలిపారు.

రొద్దం: మండల కేంద్రంలోని సచివాలయం–1 పరిధిలో పనిచేస్తున్న 15 మందితో పాటు కంబాలపల్లిలో పనిచేస్తున్న ఆరుగురు గ్రామ వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు.

రొళ్ల: మండలంలోని రొళ్ల సచివాలయం–1, 2 పరిధిలోని పని చేస్తున్న 14 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామ చేశారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ప్రసాద్‌కు రాజీనామా లేఖలను అందజేశారు.



ఓటు వినియోగంపై ఎడ్ల బండ్లలో ప్రచారం చేస్తున్న దృశ్యం

బండెనక బండి కట్టి...

పావగడ: ప్రతి ఒక్కరూ లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరుతూ స్థానిక స్వీప్ సమితి అధికారులు వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. మంగళవారం ఎడ్ల బండ్లలో ప్రచారం చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి తహసీల్దార్ సంతోష్ కుమార్ మాట్లాడుతూ... ఈ నెల 26 జ జరిగే చిత్రదుర్గం లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లందరూ పోలింగ్ బూత్‌లకు తరలివచ్చి తప్పనిసరి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదే విధంగా వంద శాతం పోలింగే లక్ష్యంగా ఇంటింటికీ వెళ్లి పసుపు కుంకుమ అందించి మహిళలకు ఓటు విలువను తెలిపే ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కరించండి

మడకశిర: మండలంలోని గురప్పకొండ ఎగువ తండాకు సంబంధించిన రోడ్డు సమస్యను పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం స్థానిక తహసీల్దార్ వెంకటేశ్‌ను కలిశారు. ప్రస్తుతం రోడ్డు లేకపోవడంతో తండా వాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సబ్ కలెక్టర్ దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్ళినట్లు పేర్కొన్నారు. తప్పకుండా రోడ్డు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

బీఎస్పీని గెలిపించండి

పావగడ: కాంగ్రెస్, బీజేపీలు ఓటు అడిగే అర్హత కోల్పోయాయి. ఈ సారి చిత్రదుర్గం లోక్‌సభ ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని అశోక్ చక్రవర్తి కోరారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో చిత్రదుర్గం జిల్లా బీఎస్పీ అధ్యక్షుడు ఎన్ ప్రకాశ్, తుమకూరు జిల్లా బీఎస్పీ కార్యదర్శి టి హనుమంతరాయ, తిప్పేస్వామి, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



గంధాన్ని ఊరేగింపుగా తీసుకెళ్తున్న దృశ్యం

● ఘనంగా గంధం వేడుక

పెనుకొండ: పట్టణ సమీపంలోని గోనిపేట రోడ్డులో వెలసిన షేక్ సయ్యద్‌షా మహమ్మద్ ఖమ్రుద్దీన్ అలి దర్గాలో గంధం వేడుకలు మంగళవారం తెల్లవారుజాము వరకూ ఘనంగా జరిగాయి. రాత్రి 2 గంటల ప్రాంతంలో ప్రారంభమైన గంధం వేడుకలను తిలకించడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఎక్యూఏ ట్రస్ట్ తరపున ఖలీముల్లా తదితరులు తలపై గంధాన్ని ఉంచుకుని మతపెద్దల నడుమ కోలాహలంగా స్వామి వారికి సమర్పించారు. మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గంధం వేడుకల్లో పాల్గొన్న భక్తులు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

రేపటి నుంచి నామినేషన్ల ప్రక్రియ

మడకశిర: మడకశిర అసెంబ్లీ స్థానానికి గురువారం నుంచి నామినేషన్లను స్వీకరించనున్నట్లు మడకశిర నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి గౌరీశంకర్, ఏఆర్‌ఓ వెంకటేశ్, ఎన్నికల విభాగం డీటీ మారుతీప్రసాద్ తెలిపారు. మడకశిర అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసే అభ్యర్థులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నామినేషన్లు దాఖలు చేయాలన్నారు. ఈనెల 25న నామినేషన్లు దాఖలు చేయడానికి చివరి రోజని పేర్కొన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ నామినేషన్లు వేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

సామాజిక మాధ్యమంపై నిఘాకు ప్రత్యేక బృందాలు

హిందూపురం అర్బన్: సోషియల్ మీడియా పోస్టులపై నిఘాకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా యూట్యూబ్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్ ఇతర సామాజిక మార్గాల ద్వారా ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివాదాస్పద పోస్టులు పెట్టడం, అసత్య ప్రచారం చేయడం వంటివి చేస్తే మొదట అడ్మిన్‌లపై చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రంథాలయం తనిఖీ



గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న రమాదేవి

గుడిబండ: మండల కేంద్రంలో ఉన్న గ్రంథాలయాన్ని మంగళవారం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమాదేవి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. రమాదేవి మాట్లాడుతూ పాఠకులకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉండేలా చూడాలని, గ్రంథాలయ సభ్యులను పెంచాల్సినదిగా సిబ్బందికి సూచించారు.

నేడు మంత్రి పర్యటన

పరిగి: మండల కేంద్రంలో శుక్రవారం మంత్రి ఉషశ్రీ చరణ్ పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే మంత్రి పర్యటనలో మండల వ్యాప్తంగా ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పకుండా పాల్గొనాలని కోరారు.

వాహనాల తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

అమరాపురం: మండల పరిధిలోని మద్దనకుంట చెక్‌పోస్టు వద్ద మంగళవారం సాయంత్రం ఎంపీడీఓ మునిస్వామి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ నెల 26న కర్ణాటకలో పార్లమెంట్ స్థానానికి ఎన్నికలు జరగనున్న దృష్ట్యా అక్రమంగా మద్యం, నగదు, ఇతర వస్తువులు తీసుకెళ్తున్నారనే అనుమానంతో చెక్‌పోస్టు వద్ద ముమ్మర తనిఖీలు చేపట్టినట్లు ఎంపీడీఓ మునిస్వామి తెలిపారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నామన్నారు.

రేపు నోటి క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

హిందూపురం టౌన్: ప్రపంచ నోటి ఆరోగ్య మాసోత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని జిల్లా ప్రభుత్వాస్పత్రి దంత విభాగంలో గురువారం ఉదయం 10 గంటలకు నోటి క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరంలో పాల్గొనే వారు ఆస్పత్రిలోని 11వ నంబర్ గదిలో అందుబాటులో ఉండే వైద్యులు విజయ్‌బాబు, ఆయిషాలను సంప్రదించాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ విజయ్‌బాబు కోరారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

హిందూపురం టౌన్: ప్రతి ఒక్కరూ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపకశాఖ అధికారి ప్రభాకర్ తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఏపీ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో స్థానిక చైతన్య పాఠశాలలో అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాల రకాలు, ఎలా జరుగుతాయి, వాటిని ఎలా నియంత్రించాలి, జరిగే నష్టం, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే అగ్ని ప్రమాదాలను ఎలా అదుపు చేయాలో విద్యార్థులకు డెమో ద్వారా చూపించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సంక్షేమ క్యాలెండర్ విడుదల



క్యాలెండర్‌ను విడులదల చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ: మండల పరిధిలోని కరికెర గ్రామంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్పకు మద్దతుగా రాష్ట్ర నాయీ బ్రాహ్మణ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తొండమల్ల పుల్లయ్య ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందులో భాగంగానే నాయీ బ్రాహ్మణ సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ అత్యంత సామాన్య రైతు కూలి కుటుంబం నుంచి వచ్చిన ఈరలక్కప్పకు పేదల సమస్యలపై అవగాహన ఉందన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి ఆయన్ను గెలిపిస్తే అందరికీ న్యాయం జరుగుందన్నారు. కార్యక్రమంలో వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, మడకశిర నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



స్వామి వారికి జ్యోతులను మోస్తున్న భక్తులు

లేపాక్షి: మండలంలోని పులమతి గ్రామంలో వెలిసిన ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకుని మంగళవారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. వేదపండితులు హోమాలను నిర్వహించి సాంప్రదాయబద్ధంగా సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. అంతకుముందుగా ఉదయం పంచామృతాభిషేకం, దీపోత్సవంతో పాటు స్వామి వారికి అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగాలు, మహామంగళారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా ప్రతి ఇంటి నుంచి జ్యోతులను తీసుకొచ్చి స్వామి వారికి సమర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశ్వర్థనారాయణ, ఎంపీటీసీ సభ్యులు నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు ఓటేస్తే టీడీపీకి వేసినట్టే'

మడకశిర: నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేస్తే ఆ ఓటు టీడీపీకి వేసినట్టేనని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎస్ రవిశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మడకశిరలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో గెలవడానికి పోటీ చేయడం లేదని, కేవలం వైఎస్సార్‌సీపీని ఓడించడానికే కాంగ్రెస్ అభ్యర్థి పోటీలో ఉన్నారన్నారు. టీడీపీని గెలిపించడానికి మాజీ మంత్రి రఘువీరారెడ్డి పని చేస్తున్నారని విమర్శించారు. టీడీపీతో కాంగ్రెస్ కుమ్మక్కైందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అభ్యర్థులకు ఫండింగ్ కూడా చంద్రబాబు చేస్తున్నారని ఆరోపించారు.

నేడు మోరబాగల్ లో ఎన్నికల ప్రచారం

గుడిబండ: మండల పరిధిలోని ముతుకూరు, మోరబాగల్, గుణే మోరుబాగల్ పంచాయతీల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడ్ తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప, ఎంపీ అభ్యర్థి శాంతమ్మ, మడకశిర ఎన్నికల ఇంచార్జ్ అనంతరాజు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

మట్కా బీటర్ అరెస్ట్

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలో మంగళవారం మట్కా రాస్తున్న బీటర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు. అతని వద్ద నుంచి రూ. 4,140 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రొళ్ల: మండల పరిధిలోని జీరిగేపల్లి గ్రామ పొలిమేరలో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.11 వేలు నగదుతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామన్నారు.